
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## అల్లూరులో డిపివో ధనలక్ష్మి సమీక్షా సమావేశం




**అల్లూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త** అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం డిపివో ధనలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీలకు నిధులు సమకూర్చడంలో ముఖ్యమైన ఆదాయవనరైన ఇంటి పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పంచాయతీలలో తాగునీటి సమస్య, సచివాలయ సిబ్బంది పనితీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా, 15వ ఆర్థిక సంఘం నిధులను క్లాప్ మిత్రులకు జీతాలు, సిసి చార్జీలు చెల్లించాలని, సచివాలయాలలో ఆధార్ సేవలలో సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అనంతరం సింగపేట సచివాలయాన్ని సందర్శించి రికార్డులను, సిబ్బంది హాజరును పరామర్శించారు. అలాగే ఇందుపూరు గ్రామ పంచాయతీని సందర్శించి స్థానిక చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్, ఎంపిడివో శ్రీదేవి, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అర్జీలకు కరువైన స్పందన



కంప్యూటరీకరణ

APESD

జిల్లా : నెల్లూరు
మండలము : దగదర్తి
గ్రామము : ఉలవపాళ్ళ

| వరుస నం. | పట్టాదారు పేరు | తండ్రి/భర్త పేరు | ఖాతా నంబరు | సర్వే నంబరు మరియు సబ్-డివిజను | భూమి వివరణ | మొత్తం విస్తీర్ణము |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | జక్కా రవికిరణ్ | రామచంద్రయ్య | 765 | 148-2 | మెట్ట | 1.1400 |

Certified By

**దగదర్తి, అక్టోబర్28, ప్రభాతవార్త:**పాలనలో పారదర్శకత వుండాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం కొంతమంది అధికారుల తీరుతో అబాసుపాలౌతుంది.సి.ఎం దగ్గరికి వెళ్ళినా,కలెక్టర్ దగ్గరికి వెళ్ళినా సంబందిత అర్జీదారులను వారినిక్కడికే పిలిపించుకొని చేయించుకోండంటూ వెకిలి సమాదానాలతో అర్జీదారులను ఇబ్బంది పెడుతున్న వైనమిది.ప్రజాప్రతినిధుల సిఫార్సులనుసైతం భేఖాతర్‌చేస్తూ ఉన్నతాదికారుల ఆదేశాలను ప్రక్కనపెడుతూ పైసలిస్తేనే పనులుచేస్తామంటూ భీష్మించుకు కూర్చుంటున్నారుదగదర్తి మండల రెవెన్యూ అదికారులు.సచివాలయ వ్యవస్థద్వారా ఆన్‌లైన్‌లో సేవలు పొందవచ్చని చెబుతున్నా మాఅనుమతిలేనిదే ఏసేవకైనా ధరఖాస్తులు స్వీకరించొద్దంటూ హుకుం జారీచేస్తున్నారు.తాము చెప్పిందేవేదం,తాము చేసిందే శాసనమంటూ నిరంకుశ ధోరణి అవలంబిస్తుండడంతో ప్రజలు తీవ్రిబ్బందులు పడుతున్నారు.మండలంలోని ఉలవపాళ్ళ గ్రామంలో కుటుంబ వివాదాల నేపద్యంలో న్యాయస్తానంలో పెండింగులో వున్న భూమికి పెద్దమొత్తంలో నజరానాలు తీసుకొని ఖాతానంబర్765తో ఎకరా పద్నాలుగు సెంట్ల భూమికి వన్‌బిను సృష్టించారు.ఈవిషయమై సంబందిత కుటుంబసభ్యులు న్యాయస్తానంలో వివాదంలో వున్న భూమికి వన్‌బి ఎలా ఇస్తారంటూ సీనియర్ అసిస్టెంట్ మరియు ఇన్‌చార్జ్ డిప్యూటీతహసిల్‌దార్‌ను ప్రశ్నించగా వాళ్ళు అడిగారు చేశాము మీరడిగారు తీసేస్తామంటూ వ్యంగ్యంగా సమాదానం చెప్పారంటూ బావురుమన్నారు.మండలకేంద్రమైన దగదర్తికి చెందిన వృద్ధమహిళ స్పందన కార్యక్రమంలో రెండువేల సంవత్సరంనుంచి శిస్తులు కడుతున్నాననిఅగ్రిమెంటుద్వారా కొనుగోలుచేసి తన అనుభవంలో వుందని 2021సంవత్సరం చివరవరకు తనపేరు వెబ్‌లాండ్‌లో కానసాగిందని ప్రస్తుతం ప్రభుత్వంనుండి ఏలబ్దిపొందాలన్నా తనకు అన్యాయం జరుగుతుందని స్పందన అర్జీ రసీదు నంబర్ 10990486, 22.8.2022న జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ దాఖలుచేసింది.జిల్లా అధికారులు అప్పటి తహసిల్‌దార్‌కు ఫోన్‌లో విషయం తెలిపి సదరు వృద్ధమహిళ సమస్యను పరిష్కరించాలంటూ మౌలిక అదేశాలు జారీచేసి సదరు అర్జీనితహసిల్‌దార్ కార్యాలయానికి పంపారు.అర్జీలు స్వీకరించిన అదికారులు చూస్తామంటూ పంపివేయగా సమస్యపరిష్కరించండంటూ కార్యాలయానికి పలుమార్లు తిరిగితే కలెక్టర్‌నే తీసుకొచ్చి పనులు చేయించుకోండంటూ సదరు అధికారి వ్యాఖ్యానించడంతో సదరు వృద్ధమహిళ నిర్ఘాంతపోయింది.అనంతరం 5.9.2022న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో మళ్లీ అర్జీ దాఖలుచేయబోగా జిల్లా రెవెన్యూ అధికారిని సమస్య పరిష్కరిస్తారు వెళ్ళండంటూ చెప్పడంతో చేసేదిలేక వెనుదిరగాల్సి వచ్చింది. మండలంలో 60శాతం మేరా అగ్రిమెంట్లపై భూములు కొనుగోలు జరిపివుండగా వన్‌బి అడంగళ్ళు లేకపోవడంతో ప్రభుత్వంనుంచి అందాల్సిన పదకాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.దీన్ని అవకాశంగా తీసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామానికో దళారీని నియమించుకొని పనికోరేటు నిర్ణయించి విస్తీర్ణాన్నిబట్టి వేలనుండి లక్షవరకు మామూళ్ళు దండుకుంటున్నారన్న అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో పేర్లు కొనసాగుతున్న వారికి మాత్రమే విత్తనాలు ఎరువులు దాన్యం కొనుగోలు తదితర పదకాలు అందుతుండడంతో తమపేర్లు వెబ్‌ల్యాండ్‌లో కొనసాగకపోవడంతో ఎలాగోలా పేర్లు నమోదుచేయించుకొని వ్యవసాయం చేయించుకోవాలంటూ రైతులు తాపత్రయపడుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి దగదర్తి మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై దృష్టిసారించి రైతులపట్ల అవహేళనగా మాట్లాడుతున్న అధికారులపై తక్షణమే చర్యలు చేపట్టి అన్నదాతల అవస్తలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనావుంది.

## నవంబరు 5న జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 28 ప్రభాతవార్త** జిల్లాపరిషత్‌కు చెందిన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నవంబరు 5న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి విషయాల..వ్యవసాయ విషయాల..విద్య-వైద్య విషయాల..స్త్రీ సంక్షేమ మరియు రక్షణ విషయాల..సాంఘిక సంక్షేమ విషయాల...ప్రణాళిక మరియు ఆర్థిక విషయాల..పనుల విషయాల స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని జెడ్పీ సీఈఓ ఆ ప్రకటనలో సూచించారు. కాగా జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం నవంబరు 2న జరుగనున్న విషయం విదితమే.

# గోడౌన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలి





**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 28 ప్రభాతవార్త** వచ్చే రబీ సీజన్‌లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు నిల్వచేసుకొనేందుకు వీలుగా జిల్లాకు మంజూరైన బహుళార్ధ సౌకర్యాల కేంద్రాల (గోడవున్లు) నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బహుళార్ధ సౌకర్యాల కేంద్రాల నిర్మాణంపై సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గోడవున్ల నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. జిల్లాకు మంజూరైన 48 గోడవున్లలో ఇప్పటికే 23 గోడవున్ల నిర్మాణం పూర్తయిందన్న ఆయన మిగిలిన గోడవున్ల నిర్మాణం వివిధ దశలలో వుందన్నారు. ఆయా గోడవున్ల నిర్మాణం వేగవంతంగా పూర్తిచేసి వచ్చే రబీ సీజన్‌లో రైతులు తాము పండించిన ఉత్పత్తులు అక్కడ నిల్వ చేసుకొనేలా చూడాలన్నారు. ధాన్యం సేకరణ కూడా ఈ గోడవున్లలోనే చేపట్టాలన్న చక్రధర్‌బాబు వర్షాకాలంలో ధాన్యం నిల్వ చేసుకొనేందుకు..వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి వసతులతో ఆయా గోడవున్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. జిల్లా సహకారశాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, నాబార్డు డిడిఎం రవిసింగ్, ఎన్‌డీసీసీబీ సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు, మార్కెటింగ్ డీఈ నారాయణరావు, ఉద్యానశాఖ ఏడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీసుశాఖ పనితీరుపై అవగాహన



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లోని ఓపెన్ హౌస్ నందు సుమారు 1000 మంది స్కూల్ విద్యార్థులకు ఆయుధాల పనితీరు, పోలీసు శాఖకు సంబంధించి పలు విషయాలపై జిల్లా ఎస్పీ విజయరావు స్వయంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే ముఖ్య ఉద్ధేశమని తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసు శాఖ వారు ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ వాడే విధానం, విపత్తుల సమయాలలో పోలీసు వారు కమ్యూనికేషన్ చేసే తీరుని విపులంగా వివరిచారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను వివరించి అందరూ మంచి ప్రవర్తనతో జీవించాలని, మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు సేవలందించాలని కోరి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. వారోత్సవ కార్యక్రమాలు పిల్లలకి ఎంతగానో ఉపయోగపడి భవిష్యత్తులో వారు కూడా ఎంతో మంచి పౌరులుగా తీర్చిదిద్దబడి ప్రజల సేవలో ముందుండి నడవడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తీవ్రవాదులు, మావోయిస్టులను ఎదుర్కొనుటలో ఏ విధమైన సాధకాలు, ఆయుధాలను పోలీసు వారు ఉపయోగిస్తున్నారో, గొడవలు, అల్లర్లు జరిగే సమయంలో టియర్ గ్యాస్‌ను, డ్రోన్లు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాల ప్రదర్శనను వీక్షించారు. అలాగే బుల్లెట్ ప్రూఫ్ వెహికల్, కమ్యూనికేషన్ వాహనం, 207 వజ్ర వాహనం, ఆయుధాలు - వివిడి భాగాల సమాచారం గురించి మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, బాంబు డిస్పోజల్ పరికరాలు, ఫింగర్ ప్రింట్ కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్‌స్క్వాడ్ బృందాలు, సెల్ జామర్, ఏకే 47, 9ఎంఎం గ్లాక్ పిస్టల్, 303 ఎన్ఎంజి (లైట్ మిషన్ గన్), 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్, జిఫ్ రైఫిల్, ఫెడరల్ గ్యాస్ గన్, వియల్ పిస్టల్, .380 రివాల్వర్, గ్రెనేడ్ హెచ్ఈ 36, గ్యాస్ గ్రెనేడ్, రబ్బర్ బుల్లెట్స్, వెహికల్ ఇన్స్‌పెక్షన్ మిర్రర్, నైట్ విజన్, డే విజన్ పరికరాలు, బైనాక్యులర్, 303 రాయిట్ గన్, 9 ఎంఎం కార్బన్, ఇన్‌శాస్ రైఫిల్, 51 ఎంఎం మోటార్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, స్నైపర్, విహెచ్ఎఫ్ సెట్ కమ్యూనికేషన్, ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ పరికరాలు, రోడ్ సేఫ్టీ వాహనాలు, బాడీ ఆన్ కెమెరా, లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, దిశ యాప్, దిశ వాహనాలు, డయల్ 100 గురించి పని చేయు విధానం గురించి విద్యార్థులకు, ప్రజలకు క్లుప్తంగా వివరించారు. అనంతరం ఉమేష్ కాన్ఫరెన్స్ హాల్ నందు పోలీసు అధికారులు, సిబ్బందికి, విద్యార్థులకు మొత్తం 370 మందికి పైగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల ఎనిర్వహణను పరిశీలించారు.

ఈ నెల 29వ తేదీన వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా యూనిట్ రన్‌లో భాగంగా ప్రజలు, విద్యార్థులు, పోలీసులు సంయుక్తంగా పాల్గొనే విధంగా నిర్వహించనున్నారని తెలియజేశారు.

# ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి



**ఇందుకూరుపేట అక్టోబర్ 28 ప్రభావార్త** ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి గ్రామంలో గడగడపప్రచారంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు,ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాబివృద్దిలో ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజలు అదృష్టమని ఆయన కొనియాడారు. శుక్రవారం మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో గడపగడప కార ్యక్రమంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండు వరాలు ఇచ్చారని ముదివర్తి నుండి ముదివర్తిపాలెం వరకు ఖాజ్‌వే నిర్మాణానికి 93 కోట్లు మంజూరు చేయడం,నెల్లూరు బ్యారేజి నిర్మాణానికి మాతండ్రి దివంగత మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టడం జీవితంలో మరచిపోలేనని అన్నారు.ఈకార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కాజ్‌వే నిర్మాణం పూర్తి అయ్యే వరకు దగ్గరుండి పనుల్ని పరిశీలించి నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్,గుణపాటి సురేష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి,కె శ్రీనివాసులురెడ్డి, జడ్‌పి వైస్ చైర్మన్,స్థానిక నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు వివరిస్తాం





**నెల్లూరు,అక్టోబరు28 ప్రభాతవార్త=విద్య** రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు తమ పార్టీ అధ్వర్యంలో త్వరలోగడప గడపకు పాదయాత్రను చేయనున్నామని జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక 51వ డివిజన్ కపాడిపాలెంలో పార్టీ నగర అధ్యక్షులు సుజయ్‌బాబు ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతు లాభాల బాటలో ఉన్న జెన్‌కోను ఉద్దేశ్యపూర్వకంగా నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వందల మంది రైతుల దగ్గర వేల ఎకరాల భూమిని జెన్‌కో నిర్మాణం కోసం సేకరించారని, దీనిని ప్రయివేటీకరించాలనుకోవటం దారుణమన్నారు. గురువారం జిల్లాలో జరిగిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. జెన్‌కోను జాతికి అంకితం కాకుండా అధానికి అంకితం చేసేందుకు ప్రభుత్వం పూనుకోవటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.జిల్లా ప్రజలను ముఖ్యమంత్రి నిలువునా మోసగించారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికులను ముత్తుకూరులో జరిగే ముఖ్యమంత్రి సభకు వెళ్లకుండా పోలీసులను వినియోగించుకుని వైకాపా నాయకులు అడ్డుకోవటం ప్రజాస్వామానికి మాయని మచ్చలా మిగిలి పోతుందన్నారు. జెన్‌కోను ప్రయివేటీకరించవద్దంటూ శాంతి యుతంగా ఆందోళణ చేస్తున్న అఖిలపక్ష నాయకులను ముందుస్తు అరెస్టుల పేరుతో నిర్బంధించటం మంచి పద్దతి కాదన్నారు. ప్రజలు ఎంతో నమ్మి ఓట్లు వేసి వైకాపాకు గతంలో పట్టం కట్టారని ఇందుకు బహుమతిగా ముఖ్యమంత్రి ప్రజలకు కష్టాలు, కన్నీళ్లను మిగిలిస్తున్నారన్నారు. నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు తమ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయటంలో భాగంగా అన్నీ డివిజన్‌లలో బూత్‌కమిటీలను ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 51 డివిజన్‌లో సమావేశాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న గడపగడపకు యాత్ర ను అందరు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుగుల కిషోర్, నగర ప్రధాన కార్యదర్శి వరకుమార్, నాయకులు కలువాయి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలపు సమస్యలపై దృష్టి పెట్టండి



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** డ్రైను కాలువల్లో పూడిక తీత పనులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తోడివేత పనులు, మురుగు పారుదల చర్యలు, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వివిధ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వర్షాకాలపు సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అధికారులను సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 37వ డివిజన్ సరస్వతినగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో దెబ్బ తిన్న రోడ్లకు అంచనాలు సిద్ధం చేసి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. మార్గానికి అంతరాయం కలిగిస్తూ రోడ్లను ఆక్రమించిన భవన నిర్మాణ మెటీరియల్, కూల్చివేత శిథిలాలను గుర్తించి జరిమానాలు విధించాలని సిబ్బందికి సూచించారు. డ్రైను కాలువల పూడికతీత సిల్టును ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పందుల బెడద లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సంపత కుమార్, ఈఈ శేషగిరిరావు, శానిటరీ విభాగం సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఫెర్టిలిటి ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



**నెల్లూరు అక్టోబర్ 28, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని మాగుంటలేఅవుట్‌లో ఉన్న మాతృత్వ ఫెర్టిలిటీ హెల్త్‌కేర్ సెంటర్, దర్గామిట్టలో ఉన్న ఏఆర్‌సి ఇంటర్నేషనల్, ఫెర్టిలిటీ సెంటర్, దర్గామిట్టలో ఉన్న ఏఆర్‌టి/ సరోగసి సెంటర్, బివినగర్‌లోని విజయలక్ష్మి ఫెర్టిలిటీ సెంటర్, క్లినిక్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ సెంటర్, క్లినిక్‌లలోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌టి/ సరోగసి సెంటర్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వాటి నిర్వాహకులకు సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆయనతోపాటు డెమో అధికారి శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ఉలవపాడు, అక్టోబరు 28, ప్రభాతవార్త :** కరేడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కరేడు-2 సచివాలయం పరిధిలో ఉన్న పొర్లుగట్టు యానాది సంఘంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫ్యామిలీడాక్టర్ ట్రైల్ రన్ కార్యక్రమం కరేడు వైద్యాధికారి టి.రమ్యశ్రీ, 104 వైద్యాధికారి లక్ష్మీ నరసింహలు నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పెరాలసిస్‌తో బాధపడుతున్న వ్యక్తిని పలకరించి వారికి సూచనలు, జా గ్రత్తలు అందించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ ఎస్‌కే జరీనా, ఆరోగ్య కార్యకర్తలు, షఫీ, బి.మాలతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు ఆర్ధిక సాయం అందించిన ఇంటూరి నాగేశ్వరరావు



**ఉలవపాడు, అక్టోబరు 28, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం ఉలవపాడు పంచాయతీలో గల కొల్లూరుపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త చరుతోటి సింగయ్య ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు కొల్లూరుపాడు గ్రామంలోని సింగయ్య ఇంటికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింగయ్య కుమారుడు గిరిబాబుకు రూ.10వేలు ఆర్ధిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పార్టీ అద్యక్షులు అంచుపోగు వాసు, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, ఉలవపాడు ఎంపీటీసీ దార్ల యలమందమ్మ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసులు, రాచగర్ల శివ, మండల తెలుగు యువత అధ్యక్షులుతొట్టెంపూడి మాల్యాద్రి, శివ, దగ్గుబాటి మాల్యాద్రి, కొండయ్య, వీరయ్య, నరసింహ, వెంకటేశ్వర్లు, రవికుమార్, రమణయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలు దేహదారుడ్యాన్ని పెంపొందిస్తాయి



**కోవూరు,అక్టోబర్28 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. కోవూరులోని బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం వాలీబాల్, కబడ్డీ పోటీలను లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహదారుడ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండి గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటువంటి పోటీల వలన మంచి ప్రావీణ్యం కలిగిన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి పలు సూచనలు చేశారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. దేవిక, బీవీ సుబ్బమ్మ, రమేష్‌బాబు, బీవీ రమణయ్య, పి. డెలీల, ఐ. రమేష్‌బాబు, కె. నాగరాజు, అజయ్, జాన్సన్, కె. సాయితేజ, తదితరులు ఉన్నారు.

## పేదవిద్యార్థులు చదువుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తా



**కందుకూరు, అక్టోబర్28, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలకు చెందిన విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తానని నెల్లూరు టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ అన్నారు. తెలివకల వారు డబ్బులు లేకుండా చదువుకునేందుకు ఇబ బ్బంది పడుతున్న వారిని గుర్తించి అవసరానికి సహాయం చేస్తానని చెప్పారు. శుక్రవారం పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బండారు శ్రావణి ఒంగోలు లోని రైస్ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యసిస్తోంది. ఇబ్బంది పడుతున్న ఆ విద్యార్థినికి రాజేష్ ల్యాప్‌ట్యాప్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఖర్చుతో కూడిన పని అని అందుకు తాను సహాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పొడపాటి శ్రీనివాసరావు, మాదాల గోవర్ధన్, నడిపినేని లక్ష్మీనరసింహ తదితరులు ఉన్నారు.

## నాణ్యతగా నిర్మాణాలు



**కోవూరు,అక్టోబర్28 ప్రభాతవార్త :** పడుగుపాడు సహకార సొసైటీ ప్రాంగణంలో 20.50 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్న గోదాము పనులను శుక్రవారం పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ నిర్మాణాలు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలతో నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన సొసైటీకి సంబంధించి ఇప్పటివరకు ఎంతమేర బంగారం ద్వారా రుణాలు ఇచ్చారు అనే విషయాలు కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు

## నేత్రదానం - మహాదానం



**కోవూరు,అక్టోబర్28 ప్రభాతవార్త :** కోవూరు మండలం మోడేగుంట గ్రామానికి చెందిన బుజ్జమ్మ గురువారం రాత్రి మరణించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో బుజ్జమ్మ నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థకు దానం చేయడం జరిగిందని, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఎం. శర్వాణి తెలిపారు. నేత్రదాత మోటివేటర్ దేవిరెడ్డి సురేష్‌రెడ్డి సహకారంతో వారి కుటుంబ సభ్యులను ఒప్పించి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ బి. లాలేష్ నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి నేత్రదాన ప్రేరేపికులు బాలాజీ సింగ్‌లు బుజ్జమ్మ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ మరణానంతరం నేత్రదానం చేయాలనుకునేవారు 9948164781, 9347111033 అనే నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

## విక్టర్ ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్



**కావలి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అంటూ దళిత నేతలు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. కావలి పట్టణ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం విక్టర్ ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత బహుజన నాయకులు ఎల్లంటి వెంకటేశ్వర్లు, గంధం ప్రసన్నాంజనేయులు, దాసరి బాలకృష్ణ, కందల గిరిబాబు, ఆర్‌విడిఎస్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విక్టర్ ప్రసాద్ దళితుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. దళితుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. నీతి నిజాయితీలకు మారుపేరుగా ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవికి వన్నెతెస్తున్న విక్టర్ ప్రసాద్‌పై టిడిపి నేతలు, మాజీ మంత్రులు కె.ఎస్.జవహర్, నక్కా ఆనంద్‌బాబులు విమర్శించడం తగదన్నారు. ఆర్యవైశ్య సంఘం నేతలు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తిపై టిడిపి నేతలు ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదని హెచ్చరికలు చేశారు. చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో దళితులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరికలు చేశారు. గాంధీ, అంబేద్కర్ మధ్య జరిగిన పోరాటాలు గురించి అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో విక్టర్ ప్రసాద్ మాట్లాడారన్నారు. అయితే పనిపాటా లేని కొంతమంది సన్నాసులు రాజకీయం చేస్తున్నారని ఇది మంచిపద్ధతి కాదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ కమిషన్ చైర్మన్ చేయలేని విధంగా దళితులకు విక్టర్ ప్రసాద్ న్యాయం చేస్తుంటే ఓర్చుకోలేక రాజకీయం చేస్తున్నారని వారు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు పాల్గొని నినాదాలు చేశారు.

## 20 రోజులుగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం



**కోవూరు,అక్టోబర్28 ప్రభాతవార్త :** గత 20 రోజులుగా మంచినీరు లేక తాము అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం పంచాయతీలోని తిప్ప గిరిజన వాసులు శుక్రవారం కోవూరు ఎంపీడీవో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 రోజులుగా తాము నీటితో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . కేవలం ఒక నీటి ట్యాంకర్ తెచ్చి రోడ్డు పక్కన పెట్టేసి వెళ్లిపోతున్నారే తప్ప దానిని ఎవరూ నిల్వ చేయడం లేదన్నారు. దీని వలన తమకు తగాదాలు కూడా వస్తున్నాయన్నారు. అధికారులు మా పరిస్థితిని గమనించి తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని వారు విన్నవించారు.

## నల్లగొండ్ల పారిశుధ్య పనులు



**వింజమూరు, అక్టోబర్28,ప్రభాతవార్త:** వింజమూరు మండలంలోని నల్లగొండ్ల గ్రామ పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య పనులను చేపట్టారు. శనివారం ఉదయం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి శాంతకుమారి రానున్న నేపథ్యంలో ముందస్తుగా నల్లగొండ్ల గ్రామ ఎంపిడిఒ సందర్శించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనంను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నల్లగొండ్ల గ్రామంలో చేపట్టే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీ, మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె కోరారు.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**వింజమూరు, అక్టోబర్28, ప్రభాతవార్త:** వింజమూరు మండలంలోని నల్లగొండ్లలో శనివారం జరగనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ అన్నపురెడ్డి ప్రమీల పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల పాలనలో ప్రజాసంక్షేమ పథకాలు ఎల్లలు దాటి ప్రజలకు ప్రయోజనకరంగామారాయన్నారు. ఈనేపథ్యంలో వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం హర్షణీయమన్నారు. ఇందులో భాగంగా కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచారకార్యదర్శి శాంతకుమారిలు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు .

## పట్టభద్రుల అభ్యర్థులు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలి

**వింజమూరు, అక్టోబర్28, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టభద్రులైన అభ్యర్థులు, వారితోపాటు అర్హులైన వారు కూడా తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని ఎంఇఒ మాలకొండలరావ్ తెలిపారు. అర్హులైనవారు నవంబరు 7తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ విద్యార్హత, ఆధార్‌కార్డ్ జెరాక్స్ తోపాటు ఒక ఫోటోను సెట్‌చేసి ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలన్నారు. గత ఓటరు జాబితాను రద్దుచేసినందున పెరిగే కొత్త ఓటరు జాబితాను తయారు చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులందరూ తమ ఓటుహక్కును విధిగా నమోదు చేయించుకోవాలన్నారు .

## దుమ్మురేగుతున్న శివాలయం వీధి



**ఆత్మకూరు, అక్టోబర్28, ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని శివాలయం ప్రాంతం నుండి అప్పారావుపాళెం వరకు కొత్తరోడ్డు వేసేందుకు సిద్ధం చేసిన అధికారులు శివాలయం ప్రాంతంలో గ్రావెల్‌ను వేసి గత 20రోజులుగా వదిలేయడంతో రోడ్డుపై రేగుతున్న దుమ్ముతో ఆప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈప్రాంతంలో ప్రయాణించే వాహనాల వలన దుమ్మురేగి ఇళ్ళలోకి , ప్రజల కళ్ళలోకి దుమ్ము భారీగా చేరుతుంది. దీంతో పలువురు రోగాలపాలవుతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండురోజుల్లో రోడ్డువేస్తామని చెప్పిన అధికారులు 20రోజులైనా పట్టించుకొనకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. పట్టణ సిపిఎం పార్టీ నేత డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఇప్పటికే రోడ్డువేసి కాంట్రాక్టర్‌కు ఈ దుమ్ముధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని చెప్పి ఉన్నామని వెంటనే రోడ్డు వేసి ప్రజల ఇబ్బందిని దూరం చేయాలంటూ డిమాండ్ చేశారు.

## తిరుమల కొండపై నాయీ బ్రాహ్మణులను బెదిరిస్తే సహించం



**కావలి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** తిరుమల కొండపై కేశఖండన వారి పట్ల విజిలెన్స్ అసభ్యకరంగా ప్రవర్తిస్తే ధర్నా చేయడం నేరమా అంటూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరి బాలగురుస్వామి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులు ధర్నా చేసినందుకు తిరుమల ఇవో ధర్మారెడ్డి బెదిరింపులకు దిగడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరికలు చేశారు. తిరుమల కొండపై అవినీతి జరగడం లేదని ఏడుకొండల స్వామిపై ఇవో ధర్మారెడ్డి ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. విజిలెన్స్ సిబ్బంది వారి విధులు నిర్వహించాలే తప్ప వంటి మీద బట్టలు విప్పి డ్రాయర్ మీద నిల్చోపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆడవాళ్ళను మగవాళ్ళు తనిఖీ చేయడం ఏమిటని తెలిపారు. లాకర్స్ పగులగొట్టి సెల్‌ఫోన్లు లాగేసుకొని దుర్భాషలాడటం ఈ విజిలెన్స్ అధికారులకు ఎవరు ఇచ్చారని తెలిపారు. తిరుమల కొండపై క్షురకులపై చర్యలు చేపడితే ప్రపంచం మొత్తం తిరుమల వైపు చూసేలా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరికలు చేశారు. టిటిడి క్షురకుల్ని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన సంఘటనలు, చరిత్ర తెలుసుకోవాలని హెచ్చరికలు చేశారు.

## తుస్సుమన్న దీపావళి స్కీమ్...లబోదిబోమంటున్న మహిళలు



**మనుబోలు, అక్టోబరు 28 ప్రభాతవార్త:** కొత్తకొత్త స్కీమ్‌లు, కొత్తకొత్త మోసాలు పల్లె ప్రజలను దగా చేస్తున్నాయి. పోలీసులు మోసగాళ్ళ ఆటకట్టిస్తున్నా కొత్త రకమైన స్కీమ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో జట్లకొండూరు, మడమనూరు గ్రామాలలో దీపావళి ఫండ్స్ స్కీమ్ తుస్సుమనింది. సుమారు 40 మంది మహిళలు ఈ స్కీమ్ ద్వారా మోసపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలావున్నాయి. మహాలక్ష్మి ఫండ్స్ పేరుతో కొత్తగా దీపావళి స్కీమ్‌ను కొందరు మహిళలు గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా గూడూరు కేంద్రంగా దీపావళి స్కీమ్ నడిపిస్తున్నారు. ఇందులో మహిళలు మాత్రమే సభ్యులుగా వుంటారు. ఒక్కో మహిళ 350 రూపాయలు 12 నెలలు 4200 రూపాయలు చెల్లించాలి. అలా చెల్లించిన మహిళా సభ్యులకు దీపావళి నాటికి పప్పు, నూనె, చింతపండు, కారం, ఉప్పు తదితర ప్రొవిజన్స్‌తో పాటు దీపావళికి సంబంధించిన టపాకాయల బాక్సును కూడా ఇస్తారు. ఈ ఏడాది గూడూరు డివిజన్‌లో వందల కొద్ది మహిళలకు ఇది చెల్లించలేదు. ఈ స్కీమ్ ద్వారా మోసపోయామని రెండు గ్రామాల మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే గూడూరుకు చెందిన చందు అనే మహిళను పిలిపించి మహిళలు కట్టిన 4 వేల 200 రూపాయలు డిసెంబరులో చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరిక్షలు



**చేజర్ల, అక్టోబర్28, ప్రభాతవార్త:** మండలంలోని నెర్నూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించినట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావిళ్ళ శ్రీహరినాయుడు పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పి మాధురి విద్యార్థులకు బ్లెడ్ గ్రూపింగ్, హెచ్‌బి పరిక్షలు నిర్వహించారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతవలన మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చుని విద్యార్థులకు వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనారోగ్యానికి గురైనప్పుడు పక్కనే ఉన్న ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి పరిక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలు తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకునే విధానం గురించి వివరించారు. చేతులు కడగకుండా తినడం వలన వ్యాధులు వచ్చే విధానాలను కూడా వివరించారు. పాఠశాల ప్రాంగణంలో, ఇళ్ళ పరిసరాల్లోను, దోమలకు ఆవాసాల్లో ఉన్న పాతటైర్లు, మిగిలిపోయిన కొబ్బరిబోండాలు ఉంచకూడదని తెలిపారు. ఈ కాలంలో వచ్చే వ్యాధులు , చికిత్సల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం గుమ్మా సుభాషిణి, ఆశాకార్యకర్త పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**మర్రిపాడు, అక్టోబర్28, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం జడ్పీహైస్కూల్లో అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలు రెండురోజులు పాటు జరుగుతాయని పిఇటి మాస్టర్ సతీష్ తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, త్రోబాల్ తదితర 9క్రీడా విభాగాల్లో మండలస్థాయిలో విద్యార్థులు పాల్గొని వచ్చే నెల 7న జరిగే నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ వివిధ విభాగాల్లో ముగ్గురు వంతున ఎంపిక చేస్తారన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## మనువాద పార్టీలలో దళిత నాయకులు మేల్కోవాలి



**నెల్లూరు టౌన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌పై మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత నాయకులు అన్నారు. దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నెల్లూరు నగరం కొండయ్యపాళెం గేట్ సెంటర్ సీపంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనం నందు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా దళిత రైట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మనువాద పార్టీలోని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మేల్కోవాలన్నారు. విక్టర్ ప్రసాద్ లాంటి నేతను దళిత ద్రోహి అని సంబోధిస్తూ ప్రెస్‌మీట్‌లు పెట్టిన జవహర్ తన పద్ధతి ఇప్పటికైనా మార్చుకోవాలని, లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చంరించారు. తమ జాతికి అన్యాయం చేసిన వారు ఎవరైనా సరే వారిని తాము విమర్శిస్తామన్నారు. ఈ అన్యాయాలకు నిరసిస్తూ ఈ నెల 31న దళిత సంఘా ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిసి వినతిపత్రాలు అందదించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కో ఆర్డినేటర్ కావలి శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలలో ఉండే దళితులు రాజ్యాంగం ప్రకారమే అధికారం అనుభవిస్తూ ఆ రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను, అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టిన ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను విమర్శలు చేయడం తగదన్నారు. రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యతనిస్తూ సోదరభావంతో మెలగాలని, విక్టర్ ప్రసాద్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పోలవరపు కార్తికేయ, జై భీమ్ సేన్ జిల్లా అధ్యక్షుడు వట్టికాల సందీప్, ఆలిండియా దళిత రైట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## సోదరి నివేదిత జయంతి



**బుచ్చి అక్టోబర్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం సామాజిక సమరసత వేదిక ఆద్వర్యంలో సోదరి నివేదిత జయంతి కార్యక్రమాన్ని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి వేదిక అద్యక్షులు ప్రణపతి వెంకటరమణయ్య, కార్యదర్శి గండికోట సుధీర్‌కుమార్, జిల్లా అద్యక్షులు నేల నూతల శ్రీదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య మాట్లాడుతు స్వామి వివేకానంద బోధనలకు ప్రభావితమైన ఒక విదేశి మహిళ మనదేశానికి వచ్చి ఇక్కడ దర్మాన్ని మతాన్ని ఆచరిస్తు ఇక్కడ ప్రజలకు సేవ చేసిన మొదటి మహిళ సంఘ సేవకురాలు సోదరి నివేదిత అని తెలిపారు. నివేదిత దేశ స్వాతంత్రంలో పాల్గోంటు బెంగాల్లో జరిగిన వరదలలో పేద ప్రజలకు సేవ చేసి ప్లేగు వ్యాధి వచ్చినప్పుడు ప్రజలకు సేవ చేసి ప్రముఖ సంఘ సేవకురాలు గా గుర్తింపు పొందారని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ముందుగా మహిళందరూ సోదరి నివేదిత చిత్రపటానికి పూలమాలలతోటి సమర్పణ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్దిని విద్యార్దులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## వైసిపి హయాంలో ముస్లింలకు పెద్ద పీట



**ఉదయగిరి అక్టోబర్ 10 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లీం మైనార్టీ వర్గానికి చెందిన సీనినటుడు వైఎస్ఆర్ సిపి నాయకులు మహ్మద్‌ఆలీని రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్‌గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఉదయగిరిలో ఉపసర్పంచ్ ముక్తుజా హుసేన్, వైసిపి నాయకుడు గడియాలేసి యజ్దాని, హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు వైఎస్ఆ ర్‌సి పి పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతు మన రాష్ట్ర ముఖ్య మంత్రి ముస్లీం మైనార్టీ వర్గాల మీద చూపుతున్న ఆదరణకు ఇదే నిదర్శనమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఒక్క ముస్లీం మైనార్టీ నాయకులకైనా న్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. వైసిపి పార్టీ అన్ని కులాలకు మతాలకు సమన్యాయం చూపుతు అన్ని వర్గాలకు అభివృద్దిని సమానంగా పంచుతు రాష్ట్రాభివృద్ది చేపడుతుందని ప్రశంసించారు.

## గాదెలదిన్నెలో స్పెషల్ ఆధార్‌క్యాంపు



**విడవలూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త** విడవలూరు మండలంలోని గాదెల దిన్నె గ్రామ సచివాలయంలో శుక్రవారం స్పెషల్ ఆధార్ కా ్యంపును అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ఆధార్ కా ్యంపులో సచివాలయం పరిధిలోని స్దానికులు, ఆధార్ సేవలను వినియోగించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేయుట, ఐదు సంవత్సరాలు లోపు చిన్నపిల్లలకు ఆధార్‌కార్డు నమోదు చేయుట, ఆధార్‌కార్డులోని పేర్లను సరిచేయుట తదితరర సేవలను స్దానికులువిని యోగించుకున్నారు.

## బుచ్చి చెన్నూరు రోడ్డులో ఫైనల్ సర్వే



**బుచ్చి అక్టోబర్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని చెన్నూరురోడ్డు విస్తరణలో భాగంగా గురువారం జిల్లా సర్వేయర్ శ్రీరామూర్తి , మండల సర్వేయర్ రమేష్, కమీషనర్ చంద్రశేఖ ర్‌రెడ్డి, ఆర్‌అండ్‌భి డిఇ హనుమంతరావు అధికారులు ఫైనల్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. వినాయకుడి గుడి వరకు సర్వే నిర్వహించి మార్కింగ్ ఇచ్చారు. మరో నాలుగు రోజులలో రెండు వైపుల డ్రైన్ పనులు చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు. వినాయకుడి గుడి అవతల నుండి మరి కొద్ది రోజులలో జిల్లా సర్వేయర్ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం సర్వే చేసిన వరకు త్వరితగతిన డ్రైనేజి నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్వేయర్ ప్రకాష్ ,భార్గవ్, ఆర్‌అండ్‌భి వర్క్‌ఇనస్పెక్టర్ షబ్బీర్ అహ్మద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గోన్నారు.

## ఈ పంట నమోదు రైతులకు ఉపయోగకరం




**విడవలూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త** వ్యవసాయం సాగు చేసే రైతులు ఈ పంట నమోదు చేసుకోవడం వలన వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. విడవలూరు మండలంలోని వావిళ్ల చౌకచర్ల, తుమ్మగుంట ,దంపూరు గ్రామాలలో ఈ పంట నమోదుపై సూపర్ పరిశీలన కార్యక్రమాన్ని చేపటా ్టరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పంటలు వేసుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు తీసుకొని పంట దిగుబడి పెంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావల్సి న విత్తనాలు యంత్ర పరికరాలను అందజేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించాడు. ఈకార్యక్రమంలో వావిళ్ల ఆర్‌బికె ఇఎఒ చరణ్‌బాబు, రైతులున్నారు.

## అల్లూరులో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన బ్రాంచి ప్రారంభం



**అల్లూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త** అల్లూరు వాటర్ ట్యాంక్ సెంటర్ వద్ద పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన బ్రాంచిని శుక్రవారం బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ మక్సూద్ ఆలి ప్రారంభించారు. తొలుత కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ దేశంలో రెండో స్థానంలో వుండి సేవలందిస్తుందన్నారు. మా బ్యాంకులోని ఖాతాదారులు పిఎన్‌బి యాప్ ద్వారా అన్ని రకాల డిజిటల్ బ్యాంకింగ్ సేవల్ని పొందవచ్చునని తెలిపారు. అల్లూరులో రైతులకు, గ్రామస్తులు విస్తృత సేవలందించేందుకు మా బ్యాంక్ సిబ్బంది పాటుపడతారన్నారు. బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ విజయవాడ సర్కిల్ హెడ్ ఆర్.కృష్ణమూర్తి, బ్యాంక్ మేనేజర్ దర్శన్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## భవిత పిల్లలకు విద్యా సామాగ్రి పంపిణీ




**బుచ్చి అక్టోబర్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డవలప్‌మెంట్ వారి ఆద్వర్యంలో భవితా ప్రత్యేక అవసరాలు గల పాఠశాలలోని పిల్లలకు పలకలు నోటిబుక్ ్స, పెన్సిల్స్ పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపిడిఒ నరసింహారావు, ఎంఇఒ దిలీప్ కుమార్ పాల్గోన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా ఈ పాఠశాలకు చేర్పించి వాళ్ల అభివృద్దికి తోడ్పడాలని వారు సూచించారు. సహారా ఎడు ్యకేషనల్ వారు పిల్లల పట్ల చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ సభ్యులు పటాన్ రహమతుల్లా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, శేషమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## బోగోలులో చిరుజల్లులు

**బిట్రగుంట, అక్టోబరు 28 ప్రభాతవార్త** బోగోలు మండలంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. రైతులు దుక్కులు దున్నేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే వర్షం రెండు మూడు రోజులు వుంటే మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే అవకాశం వుంది. ఏది ఏమైనప్పటికీ ఈ వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మామిడి వెంకటేశ్వర్లును పరామర్శించిన మాలేపాటి

**కావలి రూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం పంచాయతీ లక్ష్మీపురం గ్రామస్తుడు మామిడి వెంకటేశ్వర్లను శుక్రవారం తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శించారు. ఇటీవల తిరుపతిలో కంటి ఆపరేషన్ చేయించుకొని మామిడి వెంకటేశ్వర్లు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాలేపాటి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి వెంట తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు వాయిల శ్రీను, పెనుబాపల వెంకటేశ్వర్లు, పోతురాజు, కరిపెంగారి ప్రసాద్, అక్కంగారి శ్రీను, వాయిల బాబు, చంచంగారి ప్రసాద్, కొడూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



కోవూరు, అక్టోబర్28 ప్రభాతవార్త : త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి అర్హత కలిగిన ఉపాధ్యాయ పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎంఈవో రహీమ్ తెలిపారు. కోవూరులోని మండల ప్రాథమిక విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ నెల 7వ తేది లోగా అర్హత కలిగిన వారు తమ ఓటు హక్కును వారి విద్యార్హత , ఆధార్ జెరాక్స్‌లతో పాటు దరఖాస్తుకు రెండు పాస్‌పోర్టు ఫొటోలను జత చేసి ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాను రద్దు చేయడం వలన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## సత్కారాలతో బాధ్యతలు పెంపు




**నెల్లూరురూరల్, అక్టోబరు28 ప్రభాతవార్త** సత్కారాలతో బాధ్యతలు పెరుగుతాయని కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటి అధికారి నాగసాయిసూరి తెలిపారు. నేషనల్ బెస్ట్ సర్వీసెస్ అవార్డులు అందుకున్న సందర్భంగా పియంపి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, జయప్రకాష్‌లను శుక్రవారం బుజబుజనెల్లూరు పియంపి అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన అభినందనసభలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరువురికీ ఏకకాలంలో అవార్డులురావడం సేవాతత్పరతకు నిదర్శ నమన్నారు. ఈస్ఫూర్తితో మరింతమంది సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకురావాలని సూచించారు. ఈకారక్రమంలో డాక్టర్ నటరాజకన్నన్, పియంపి నాయకులు డాక్టర్ సత్తార్, శేషయ్య, శ్రీనివాసులు, వీరయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## కండలేరులో 53.602 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), అక్టోబరు 28 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో శుక్రవారం ఉదయానికి 53.686 టీయంసీల నీటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 1130 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వుండగా జళాశయం నుండి లోలెవల్ స్లూయిస్ నుండి 100క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 150 క్యూసెక్కుల నీరు, హెడ్ రెగ్యులేటర్ నుండి సత్యసాయి గంగ కాలువలోకి 1700క్యూసెక్కుల నీరు, పిన్నేరు వాగుకు 150 క్యూసెక్కులు, 1 వ బ్రాంచి కెనాల్‌కు 25 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2125క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు తెలిపారు.

## మూడవ రోజు అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం



**రాపూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న అన్న దానం మూడవ రోజైన శుక్రవారం నిర్వహించారు. ఉదయంస్వామి వారి ఆలయంలో శ్రీ మహావిష్ణువుకు, శ్రీ అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున్న భక్తులు ఆయ్యప్ప మాలాధారణ చేసుకున్నారు. మద్యాహ్నం స్వామి వార్లకు పూజలు నిర్వహించిన అనంతరంమాలాధరణ చేసిన ఆయ్యప్ప స్వాములకు, గోవింద స్వాములకు అన్నదానం నిర్వహించారు. మూడవ రోజు అయ్యప్ప స్వాములకుగోవింద స్వాములకు మద్యాహ్నం బిక్ష కార్యక్రమాన్ని పులిగిలపాడుకు చెందిన సిమెంటు రాళ్ళ వ్యాపారీ చల్లా శ్రీనివాసులుదంపతులు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గోని మద్యాహ్నం బిక్ష స్వీకరించారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి



**రాపూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త** కలువాయి మండలంలోని కుళ్ళూరు గ్రామంలో భైరపోగు పెంచలయ్య వ్యవసాయ భూమిలో వున్న భారతరాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనిబహుజన సమాజ్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం అధ్యక్షుడు ఓరేపల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రాపూరు మండల పరిషత్ కార్యలయం ఆవరణలో బి.ఎస్.పి ఇతర నాయకులతో కలసి 30వ తేది తిరుపతిలో జరిగే రాయలసీమ బహుజన రా జ్యాధికార సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు. బహుజన సమాజ్ పార్టీ నాయకులు నియోజకవర్గ కార్యదర్శి సర్వేపల్లి కోటయ్య, ఇతర నాయకులు వున్నారు.

## కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ స్కూల్స్



**ఉదయగిరి అక్ట్ బర్ 28 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలో శ్రీగుంటుపల్లి కొండయ్య చౌదరి జడ్‌పిస్కూల్‌లో విద్యార్దులకు ఐడికార్డులు ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ స్కూల్ ్సకి తగ్గకుండా యూనిఫాం, ఐడికార్డు, జగనన్న విద్యాకానుకతో గుర్తింపు స్దాయిలో పిల్లలకు నాణ్యమైన చదువు పరిశుభ్రమైన వా తావరణంలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో స్కూల్స్‌లో నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతు విద్యార్దిని, విద్యార్దులకు మౌళిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు కార్పోరేట్ స్కూల్ మాయంలో పడి డబ్బులు పోగొట్టుకోకుండా ప్రభుత్వ స్కూల్ ్సలో పిల్లల్ని చేర్పించాలని ఆయన కోరారు.

## మారుతున్న కాలంలో పోలీసుల పాత్ర



**ఉదయగిరి అక్టోబర్ 28 ప్రభాతవార్త** జిల్లా ఎస్‌పి సిహెచ్ విజయరావు ఆదేశాల మేరకు ఉదయగిరి సిఐవి గిరిబాబు సూచనల మేరకు పోలీసు అమరవీరుల వారోత్స వాలలో భాగంగా ఉదయగిరి పట్టణంలోని ప్రగతి జూనియర్ కాలేజి ,సెయింట్ మేరీస్ హైస్కూల్లో మారుతున్న కాలంలో పోలీస్‌పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్దులు రాస్తున్న వ్యాసరచన పోటీల ప్రక్రియను ఎస్‌ఐ అంకమ్మ, సిబ్బంది పరిశీలించారు.

## ఎస్‌జిఎఫ్ మండల స్దాయి క్రీడా ఎంపికలు



**బుచ్చి అక్టోబర్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం డిఎల్‌ఎన్‌ఆర్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల బుచ్చిరెడ్డిపాళెం క్రీడా ప్రాంగణంలో ఎస్‌జిఎఫ్ మండలస్దాయి కబడ్డీ, త్రోబాల్, టెన్నీకాయిట్ క్రీడా అంశలలో మండల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల యందు సుమారు వందమంది మండలంలోని ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ దిలీప్‌కుమార్ బుచ్చిరెడ్డిపాలెం మండల స్దాయిలో ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఎంపికైన జట్లు త్వరలో జరగబోయే నియోజవర్గ స్దాయి క్రీడా పోటీలలో పాల్గోంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయురాలు నాగ పద్మ, వ్యాయామోఉపాధ్యాయులు క్రీడా పోటీలలో పాల్గోన్నారు.

## సియం సహాయ నిధి చెక్కుల్ని పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కావలి, అక్టోబరు 28 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో శుక్రవారం 25 మంది బాధితులకు సియం సహాయ నిధి చెక్కుల్ని ఎమ్మెల్యే అందజేశారు. 29 లక్షల 23 వేల రూపాయల వ్యయం కల్గిన చెక్కులను బాధితులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, వైసిపి నేత అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఆటల పోటీలు



**వింజమూరు, అక్టోబర్28, ప్రభాతవార్త:** వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీల ఎంపికలు శుక్రవారం 2వరోజు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17లో బాల ,బాలికలు కబడ్డీ, ఖోఖోలో టీమ్‌కు 12మంది వంతున ఎంపికైనట్లు పాఠశాల పిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంపికకు అర్హులైన విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీ నుండి జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందినట్లు అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు చక్కగా రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిడి ఎన్.శ్రీనివాసులు, పిఇటిలు ఎన్.మాచర్ల, పి.నాగరాజు, బి.కృష్ణ, రజనీవిలాసిని, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగులచవితికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాలేపాటి



**కావలి రూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త** నాగులచవితి పర్వదినం సందర్భంగా శుక్రవారం కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం పంచాయతీలోని వెంకటేశ్వరపురం వద్ద నాగేంద్ర స్వామి పుట్టవద్ద తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవి చంద్ర, కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు వాయిల శ్రీను, పెనుబాపల వెంకటేశ్వర్లు, పోతురాజు, కరిపెంగారి ప్రసాద్, అక్కంగారి శ్రీను, వాయిల బాబు, చంచంగారి ప్రసాద్, కొడూరు రామకృష్ణ, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న డాక్టర్ రామస్వామి



**కావలి, అక్టోబరు 28 ప్రభాతవార్త** కొవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతో మంది కరోనా బాధితులకు వైద్య సేవలందించి ప్రాణాల్ని కాపాడిన కావలి పట్టణానికి చెందిన డాక్టర్ రామస్వామి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల చైర్మన్, ప్రముఖ ఆర్థో సర్జన్ డాక్టర్ మంచిగంటి రామస్వామిని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి ఏకైక డాక్టర్‌గా రామస్వామిని బంగారు పతకంతో గవర్నర్ సత్కరించారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన డాక్టర్ రామస్వామిని శుక్రవారం విజయవాడలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక అవార్డుల ప్రధానోత్సవంలో సత్కరించారు. అవార్డు అందజేశారు. రెడ్‌క్రాస్ ద్వారా విశేష సేవలం దించిన జిల్లా కలెక్టర్లకు, కొవిడ్-19 బాధితులకు విశిష్ట సేవలందించిన మానవతా మూర్తులకు రాష్ట్ర గవర్నర్ హరిచందన్ అవార్డులు అందజేశారు. ఈ సందర్బంగా కావలి పట్టణంలోని డాక్టర్ రామస్వామి తన వైద్య శాలను కొవిడ్ బాధితుల కేంద్రంగా ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించి ప్రత్యేకతను చాటిచెప్పడంతో ఈ అవార్డును అందజేశారు. ప్రథమ శ్రేణి కొవిడ్ యోధులైన మున్సిపల్ కార్మికులు, పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు, రెడ్‌క్రాస్ సంస్థకు భూరి విరాళాన్ని అందజేసి ఆదుకున్నందుకు ఆయనకు ఈ గౌరవం అందజే శారు. అంతేకాకుండా జాతీయ రహదారిపై వెళ్తున్న వలస కార్మికులకు ఆకలి తీర్చినందుకు డాక్టర్ రామ స్వామి సేవలను గుర్తించి గవర్నర్ బంగారు పతకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు పతక గ్రహీత డాక్టర్ మంచిగంటి రామస్వామి మాట్లాడుతూ ఎటువంటి దరఖాస్తు చేయకుండా తన సేవలను గు ర్తించి ఈ అవార్డు అందజేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్ కె.వి.ఆర్.చక్రధర్‌బాబుకు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, కావలి రెడ్‌క్రాస్ బృందానికి డాక్టర్ రామస్వామి ధన్యవాదాలు తెలిపారు.

**పలువురు ప్రశంసలు...** గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్న డాక్టర్ మంచిగంటి రామ స్వామిని శుక్రవారం పలువురు ప్రశంసించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్, ఐయంఎ గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ రామస్వామి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కొవిడ్ బాధితులకు వైద్య సేవలందించి ప్రాణాల్ని కాపాడారన్నారు. రెడ్‌క్రాస్‌తో సహా కొవిడ్ నిరాశ్రయులకు సేవలు అందిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహకరం అందజేసి అండగా నిలబడ్డారన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుండి అవార్డు అందుకున్న ఏకైక వ్యక్తి డాక్టర్ రామ స్వామి అని కొనియాడారు. కావలి ఆర్టీసి డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గవర్నర్ చేతుల మీదుగా డాక్టర్ రామస్వామి బంగారు పతకం అందుకోవడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఆర్టీసి సంస్థ అభివృద్ధికి, కార్మికుల అభ్యున్నతికి ఆయన అండగా వుంటూ కొవిడ్-19లో ఎంతో మందికి సామాన్లు అందజేసి ఆదుకున్నారన్నారు.

## రగ్బీ సబ్ జూనియర్‌లో గండవరం పాఠశాల విద్యార్థులకు ప్రథమ స్థానం



**కొడవలూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త:** రగ్బీ సబ్ జూనియర్ చాంపియన్ షిప్2022లో కొడవలూరు మండలం, గండవరంలోని జిల్లా ఉన్నత పాఠశాలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా, ఆర్థవీడులో జరిగిన, రగ్బీ సబ్ జూనియర్ చాంపియన్ షిప్2022లో ఫిజకల్ ఎడ్యుకేషన్ టీచర్ శివనాగబాబు ఆధ్వర్యంలో, కోచ్ వంశీ సారధ్యంలో విద్యార్థులు పాల్గొని. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో సాధించారని, దీనికి ఎంతగానో గర్వంగా ఉన్నదని, సంతోషం వ్యక్తం చేశారు. పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లును అందజేశారు. ఈ సందర్భంగావిద్యార్థులను, ఫిజకల్ ఎడ్యుకేషన్ టీచర్‌ను, కోచ్‌నుఅభినం దించారు. ఫిజకల్ ఎడ్యుకేషన్ టీచర్, బోధన మరియు భోదనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 5 గ్యాస్‌సిలిండర్లు సీజ్



**కోవూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త** కోవూరులోని పా టూరు రోడ్డులో ఉన్న ఒక క్యాటిరింగ్ సంబంధించిన 5గ్యాసి సిలిండర్లనుశుక్రవారం సాయింత్రం ఎన్‌పోర్స్ మెంట్ డిప్యూటి తహసిల్దారు కృష్ణ ప్రసాద్ ఆఖస్మి కంగా దాడులు చేసిసీజ్ చేశారు. ఈ మేరకు ఏ శ్రీ హరి అనే వ్యక్తిపై 6-ఏ కేసు నమోదు చేయడం జరి గిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## హామీతో దీక్ష విరమణ

**చేజర్ల,అక్టోబర్28,ప్రభాతవార్త:** తమ సమస్యలను పరిష్కరించకపోవడంతో భారతీయ జనతాపార్టీ మూడు రోజులుగా తహసిల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారంతో విరమించుకున్నట్లు బాజాపానేతలు పేర్కొన్నారు. తమ పొలాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుతుంటే స్పందించలేదని దీంతో తాము మూడురోజులుగా తహసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టామన్నారు. శుక్రవారం తహసిల్దార్ తమ సమస్యలను పరిష్కరించేందుకోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసిల్దార్ తెలియజేయడంతో దీక్ష విరమిస్తున్నట్లు బిజెపి నాయకులు తెలబాటి వెంకటరామానాయుడు, బత్తల కృష్ణయ్య, కుంకుబాలయ్య, ఓర్సు పెంచలయ్య తదితరులు పేర్కొన్నారు.

## కావలి ఏరియా వైద్యశాలను అన్ని వసతులతో తీర్చిదిద్దుతా



**కావలి, అక్టోబరు 28 ప్రభాతవార్త** కావలి ఏరియా వైద్యశాలను అన్ని వసతులతో తీర్చిదిద్దుతానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కామంచి సుబ్బారావు సారథ్యంలో డాక్టర్లు, సిబ్బందిని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పూలబొకెను అందజేశారు. డిసిహెచ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేను గ్రీట్ చేసి ఫొటోషాట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నాడు-నేడు క్రింద కావలి ఏరియా వైద్యశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తానన్నారు. వైద్యులకు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామంచి సుబ్బారావుతో పాటు ఆర్‌యంవో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మండవ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే నాజీవితం అంకితం



కొండాపురం,అక్టోబర్28,ప్రభాతవార్త:ప్రజాసేవకే నాజీవితం అంకితమని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు మేకపాటి.చంద్రశేఖరరెడ్డి అన్నారు.శుక్రవారంఆయన కొండాపురం మండలం తూర్పుఎర్రబల్లిలో జరుగుతున్న గడప,గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేశారు.తొలుత నూతన సచివాలయం,వాటర్ ప్లాంటును ప్రారంబించారు.అనంతరం ఎర్రబల్లి పంచాయతీలో గడప,గడపకు తిరిగి మన ప్రభుత్వం అందించు సంక్షేమ ఫలాల కరపత్రాలను పంపిణీచేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మన ప్రభుత్వం పార్టీలకు,కులాలకు,మతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్దిచేకూరేలా సంక్షేమ ఫలాలనుఅందిస్తుందన్నారు.వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చడం ఒక్క జగన్‌కే సాధ్యమైందన్నారు.జగన్ పరిపాలనలో నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో వుంటూ వారి, వారి సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు.తాను చేసినంత అభివృద్ధి ఎవ్వరూ చేయలేదన్నారు.తాను ఇప్పటికే నాలుగుసార్లు శాసనసభ్యునిగా పరిపాలించడం జరిగిందన్నారు.వచ్చే ఎన్నికల్లో కూడా మరోసారి శాసనసభ్యునిగా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు.తాను ఉదయగిరిలో 100పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.గ్రామస్తులు కొందరు వారి సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన మేకపాటి అధికారులను పిలిచి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ఉదయగిరి నియోజకవర్గ ప్రచారకార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవార్గన్ని అన్ని విధాలుగా అభివృద్దిచేయాలంటే మేకపాటికే సాధ్యమన్నారు.నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పనులు మొత్తం పూర్తి కావాలంటే మేకపాటినే మరోసారి ఎం.ఎల్.ఎగా ఎన్నుకోవాలన్నారు.మెట్టప్రాంత ఉదయగిరి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని కార్పోరేట్‌వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో ఉదయగిరిలో వందపడకల ఆసుపత్రిని శాసనసభ్యుల సొంత నిధులతో ఏర్పాటుచేసేందుకు ముందుకు రావడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు.అనంతరం గ్రామస్తులు మండల కన్వీనర్ చిమ్మిరి.రాజేంద్రప్రసాద్ ఆద్వర్యంలో మేకపాటి.చంద్రశేఖరరెడ్డిని,శాంతికుమారిని ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో ఎం.పి.పి బొడ్డు.అనూరాధ,వై.సి.పినేతలు అన్ని శాఖల అధికారులు వున్నారు.

## ప్రహరీ గోడ లేని బాలసదనము



**నెల్లూరు టౌన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని బాలసదనముకు ప్రహరీ గోడ లేకపోవడంతో పందులు, కుక్కలు, పశువులు ప్రాంగణంలోనికి ప్రవేశిస్తున్నాయని, దీంతో చిన్నారులకు అసౌకర్యానికి గురి చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. శిశు గృహ, వర్కింగ్ ఉమెన్ ప్రభుత్వ వసతి గృహము, బాలసదనము, ఐసిడియస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి కార్యాలయము ఇవన్నీ ఒకే చోట నిర్మితమై ఉన్నాయి. స్త్రీ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే బాలసదనము నిర్వహించబడుతుంది. ఈ బాలసదనము సరిగ్గా ఐసిడియస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి కార్యాలయానికి ఆనుకునే ఉంది. సుమారు గత రెండున్నర సంవత్సరాల క్రితం బాలసదనము మరమ్మతులకు ప్రభుత్వం కొంత నిధులు మంజూరు చేయగా ఆ నిధులను సంబంధిత కాంట్రాక్టర్ నామమాత్రంగా సున్నాలు, రంగులు అద్ది చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. ఇదే దేశంలో ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిచిన కాంట్రాక్టర్ మరమ్మతుల సమయంలోనే ఇటుకరాళ్లు సిద్ధం చేశారు. అయితే ఆ ఇటుక రాళ్లు ప్రస్తుతం కానరావడంలేదు. అంతర్గత ప్రధాన రహదారికి పడమర వైపు ఈ బాలసదనము నిర్మితమై ఉంది. అయితే ప్రహరీ గోడ నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. సేకరించిన సమాచారం మేరకు ప్రహరీ గోడ నిర్మాణానికి అంతర్గత రక్షణ కంచె ఏర్పాటుకు సుమారు రూ.5 లక్షలు మంజూరయిందని, నిర్మాణ పనులు చేపట్టేందుకు ఈ నిధులను గృహ నిర్మాణాల శాఖకు బదిలీ అయినట్లు తెలుస్తోంది. మంజూరైన ఈ నిధులు ఇటు గృహ నిర్మాణాల శాఖలోనూ, అటు ఖజానా హెడ్‌లోను కనబడడంలేదనేది అంతుపట్టడంలలేదని, ఈ ఘటన అధికారులకే తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. మరి మంజూరైన ఈ నిధులు ఎక్కడ దాగి ఉన్నాయో అదధికారుల విచారణలో నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉంది. జిల్లాలోని పలువురు బాలికల వివిధ కారణాలచే అనాథలైన బాలికలు (సంపూర్ణం లేదా పాక్షికం) 1వ తరగతతి నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసిసస్తున్న వారికి నివాస వసతితో పాటు భోజన సదుపాయం కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోందది. ప్రస్తుతం నెల్లూరులోని ఈ బాలసదనంలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే 28 మందది బాలికలు ఉన్నారు. తాత్కాలికంగానైనా ఈ బాలసదనముకు ప్రహరీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయమై బాలసదనము సూపరింటెండెంట్ లక్ష్మీదేవి వివరణ ఇస్తూ ప్రహరీ గోడ మరియు రక్షణ కంచె ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉన్నామన్నారు. అలాగే బాలసదనము ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నామని, ప్రాంగణంలోకి పందులు, శునకాలు, పశువులు ప్రవేశించకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.






## కార్మికుల పనిముట్లకే మొదటి ప్రాధాన్యత



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీవన భద్రతతో పాటు వారి విధులకు అవసరమైన పనిముట్లు, రక్షనా ఉపకరణాలు అందించేందుకు మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని డి.హరిత తెలిపారు. కార్పొరేషన్ ఆరోగ్య శాఖాధికారి, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల అలవెన్సులను వెంటనే మంజూరు చేయాలని, హెల్త్ కార్డుల మంజూరులో జాప్యం చేయొద్దని సూచించారు. విధుల నిమిత్తం కార్మికులందరికీ నూతన అప్రాన్‌లను అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలను అందరు కార్మికులకు వర్తింపజేయాలని, వివిధ సంక్షేమ సౌకర్యాలపై కార్మికులందరికీ అవగాహన పెంచాలని సూచించారు. మరణించిన పారిశుధ్య కార్మికుల మట్టి ఖర్చుల నిమిత్తం వెంటనే రూ.15 వేలు మంజూరు చేయాలని, పారిశుధ్య తరలింపు వాహనాల్లో మహిళా కార్మికులకు విధులు కేటాయించవద్దని ఆదేశించారు. కార్మికుల అన్ని ప్రధాన సమస్యలను సామరస్యంగా పరిష్కంరించేందుకు నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య అధికారి, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



**నెల్లూరురూరల్, అక్టోబరు28 ప్రభాతవార్త** రూరల్ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు రూరల్ పరిధిలో రెండవ విడత గడపగడపకూ - మనప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం 27వడివిజన్ స్థానిక గాయత్రినగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామి ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామిలను నెరవేర్చడమే కాక సంక్షేమం అందరికీ అందుతుందా లేదా తెలుసుకునేందుకు గడపగడపకూ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. స్థానిక సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరిస్తూ ముందుకుసాగారు. స్థానిక కార్పొరేటర్ భీమినేని మురహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి



**నెల్లూరురూరల్, అక్టోబరు28 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని విద్యాలయాల్లో పూర్తి స్థాయిలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని డికెడబ్ల్యు కళాశాల్లో రూ.1.01కోట్ల అంచనాలతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మేయర్ స్రవంతి, వైకాపా కార్యదర్శి గిరిధర్‌రెడ్డిలతో కలసి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేపట్టిన పనులను నాణ్యతాప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు - నేడు పథకంలో భాగంగా విద్యాలయాలను అభివృద్ధి చేసి తద్వారా విద్యలో ఉన్నత ఫలితాలను సాధించేందుకు ప్రభుత్వం కీషి చేస్తోందన్నారు. ప్రతిష్టాత్మక డికెడబ్ల్యు కళాశాల అబివృద్ధికి శాసనసభ్యునిగా తనవంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. విద్యార్దినులకు స్వంత నిధులతో క్రీడాసామాగ్రి అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఘనంగా కార్తీక శుక్రవారం పూజలు



**కోవూరు, అక్టోబర్28 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే శుక్రవారం సందర్భంగా ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు కార్తీక పూజలు నిర్వ హించారు. ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, భక్తులు ఉన్నారు.

# గుంటూరుపై జిల్లా ఏపిఆర్ఎస్ఏ జట్టు గెలుపు

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 28 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపిఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు సంబంధించి గురువారం జోన్-3 (నెల్లూరు, ప్రకాశం, గుంటూరు) ఉద్యోగుల మధ్య జరిగిన క్రికెట్ పోటీలలో నెల్లూరుజిల్లా ఏపిఆర్ఎస్ఏ జట్టు విజయం సాధిం చింది. నవంబరు 11, 12,13 తేదీలలో గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో ఏపిఆర్ఎస్ఏ ఆధ్వ ర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా సాంస్కృతిక పోటీలు జరుగనున్నాయి.

ఇందులో భాగంగా గురువారం గుంటూ రులోని ఆర్ఎస్ఆర్ కాలేజీలో జోన్-3కి సంబంధించి జరిగిన క్రికెట్ పోటీలలో గుంటూరుజిల్లా జట్టుపై నెల్లూరుజిల్లా ఏపిఆర్ఎస్ఏ జట్టు విజయం సాధించడం గమనార్హం. ఏపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు అల్లం పాటి పెంచలరెడ్డి సారథ్యంలో గుంటూరు జిల్లా జట్టుపై విజయం సాధించిన నెల్లూరుజిల్లా ఏపిఆర్ఎస్ఏ జట్టు నవంబరులో నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ప్రకాశంజిల్లా జట్టుతో తలపడనుంది.

